

# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | శుక్రవారం 01-05-2026 | సంపుటి - 27 | సంచిక -339 | రూ : 4 | పేజీలు: 8


కవిత పార్టీ.. '
## తెలంగాణ రక్షణ సేన'!

- తిపాదిత ఐదు పేర్లలో దీన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం
- అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం.. ఈసీఐ లేఖ

2లో






# నాణ్యత విషయంలో రాజీ పడొద్దు

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి
సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



హైదరాబాద్: విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ సూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగులు, ఐడీ కార్డులు, యూనిఫాం.. అన్నీ నాణ్యమైనవే ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందేలా చూడాలన్నారు. అవన్నీ అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై.. విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యాశాఖతో పాటు బీసీ, మైనారిటీ

తరువాయి 2లో



అమెరికా సైన్యానికి
## ఇరాన్ హ్యాకర్ల షాక్!

- ఇరాన్‌తో సంబంధాలున్న హండాలా అనే సైబర్ గ్రూప్ దాడి
- పర్షియన్ గల్ఫ్‌లోని 2,379 మంది యూఎస్ మెరైన్స్ డేటా లీక్
- సైనికుల వాట్సాప్‌కు బెదిరింపు సందేశాలు పంపిన హ్యాకర్లు
- ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన అమెరికా రక్షణ శాఖ పెంటగాన్
- గతంలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ ఈమెయిల్‌ను హ్యాక్ చేసిన ఇదే గ్రూప్

2లో

## అమెరికాతో పాకిస్థాన్ డబుల్ గేమ్?.
## ఇరాన్‌కు అండగా కీలక నిర్ణయం!

- అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్
- ఇరాన్‌తో వాణిజ్యం కోసం ఆరు భూమార్గాలను తెరిచిన పాక్
- ట్రంప్ 'గరిష్ఠ ఒత్తిడి' వ్యూహాన్ని దెబ్బతీసే చర్యగా విమర్శలు
- పాక్ డబుల్ గేమ్ ఆడుతోందన్న అమెరికా భద్రతా నిపుణులు
- పాక్ విశ్వసనీయతపై ఇజ్రాయెల్, ఇరాన్‌ల నుంచి కూడా సందేహాలు

2లో








మోదీ టూర్ అప్‌డేట్స్
## కిషన్ రెడ్డి కీలక ప్రకటన

- మే 10న హైదరాబాద్ వస్తున్న ప్రధాని మోదీ
- రాష్ట్రంలో రూ. 7,823 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్న కిషన్ రెడ్డి
- రూ. 85 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడి

2లో

మే 1 నుంచి మారనున్న
# కీలక నిబంధనలు

- ఎల్‌పీజీ సిలిండర్ ధరలు, బుకింగ్, డెలివరీ నిబంధనల్లో కీలక మార్పులు
- ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై పెరగనున్న లేట్ పేమెంట్ ఫీజులు.. మారనున్న ఫీజు మినహాయింపు రూల్స్
- ఆన్‌లైన్ గేమింగ్ కోసం కఠినమైన కొత్త చట్టం, ప్రత్యేక అథారిటీ ఏర్పాటు
- సీఎన్‌జీ-పీఎన్‌జీ ధరల సవరణకు అవకాశం

2లో









తెలుగు అకాడమీ విభజన
## మా వాటా మాకు ఇవ్వండి!

- ఏపీ వాటా నిధులు విడుదల చేయాలని తెలంగాణను డిమాండ్ చేసిన తెలుగు అకాడమీ
- సుప్రీంకోర్టు ఆదేశించినా తెలంగాణ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపణ
- నిధుల కొరతతో అకాడమీ కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులున్నాయన్న ఛైర్మన్ విల్సన్
- ఇంటర్ పుస్తకాల బకాయిలు రూ.50 కోట్లు కూడా రావాల్సి ఉందని వెల్లడి
- అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా ఇవ్వాలని ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి

2లో

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



*** కలెక్టర్ అనురాగ్ జయంతి**

భువనగిరి ప్రజాస్ఫూర్తి : గురువారం గుండాల మండలం అనంతారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలనుజిల్లా కలెక్టర్. అనురాజ్ జయంతి పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయనీ, అవి ఏ దశలల్లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకు పూర్తి అయినంత వరకు లబ్దిదారుల అకౌంట్ లలో బిల్లులు వచ్చాయా అనిఅడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలి అని అన్నారు.అనంతరం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో శిదిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.గ్రామంలో ఎన్ని అంగన్వాడీ లు ఉన్నాయనీ. అందులో ఎంత ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నారు అని అడిగి తెలుసుకున్నారు.హై స్కూల్ లో కొత్త అంగన్వాడీ రూమ్ నిర్మాణం కోసం కృషి చేస్తా అన్నారు.గ్రామంలో ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాల లలో ఎంత మంది గర్భిణిస్త్రీలు ఉన్నారనీ. వాళ్ళ అందరికి రెగ్యులర్ గా ప్రభుత్వ ఆసుపత్రి లలో చెకప్ లు చేయిస్తున్నారా అని ఆశ వర్కర్ లని కలెక్టర్ అడగడం జరిగింది.. డెలివరీ లు కూడా ప్రభుత్వ అసుపత్రి లలో అయ్యేలా చూడాలి అన్నారు. గ్రామంలో ఉన్న గర్భిణి స్త్రీ ఇంటికి వెళ్లి వాళ్ళ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ లో ఇచ్చే భోజనం చేస్తున్నారా అని అడిగారు. మంచి పోషకాలు ఉన్న ఆహారం తినాలి అని చెప్పారు. ఇటీవల గ్రామంలో గర్భిణీ స్త్రీ యొక్క భర్త ఆరోగ్యం బాగోలేక మరణించారాని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి.ఆమెకు ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్లిమ్మర్ లో గోల్డ్ మెడల్, సీఎం కప్ సాధించిన విద్యార్థికి ఘన సన్మానం



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : 15 సంవత్సరాలు తాను ఈత ఒక సాధనణ అనే ప్రయత్నంలో నా యొక్క స్టేట్మెంట్ ని చూసి సూరారం ప్రాంతానికి చెందిన రవికుమార్ గౌడ్ కూతురు ఎం.లిఖిత గౌడ్ స్లిమ్మర్ లో గోల్డ్ మెడల్, సీఎం కప్ సాధించిడం అభినందనీయమని పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు. గురువారం లిఖిత గౌడ్ను ఆయన అభినందించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లిఖిత గౌడ్ ఏడవ తరగతి వరకు చదివి డైరెక్ట్ గా పదవ తరగతిలో ఎగ్జామ్ రాసి 458 మార్కులు సాధించడంతో ఆ అమ్మాయిని సగౌరవంగా సన్మానించి బహుమతి అందజేసినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిని, ఈ త నేర్చుకోవాలన్నారు. అంకితభావంతో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారందరి కూడా ధన్యవాదాలు తెలియజేశారు. చదువుకు వయస్సు అడ్డంకి రాదు కావున ప్రతి ఒక్కరు కూడా వయసుతో నిమిత్తం లేకుండా చదువుకోవచ్చు నిజంగా ఈ అమ్మాయి ఏడవ తరగతి నుంచి డైరెక్ట్ గా టెన్త్ పాస్ అవడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. ముఖ్యంగా దీక్ష స్కూల్ వారికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎన్ఎస్ కే కే పాఠశాలలో వంద శాతం ఫలితాలు



V. LASYA
582 / 600



S. VIVEKANANDA
581 / 600

జిన్నారం,ప్రజాస్ఫూర్తి : ఎన్ఎస్ కేకే పాఠశాలలో ఎస్ఎస్ సి.2026 విద్యార్థిని,విద్యార్థులు, వంద శాతం ఫలితాలతో విజయ దుందుభి మోగించారు.202526 విద్యా సంవత్సరం లో 78 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ విద్యార్థిని,విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.582 మార్కులతో వి.లాస్య ప్రథమ స్థానం కాగా 581 మార్కులతో వివేకానంద ద్వితీయ స్థానం సాధించారు. ఇక 569 మార్కులతో వై. అక్షర తృతీయ స్థానంలో నిలిచారు. అత్యుత్తమ ప్రతిభ చూపించిన విద్యార్థిని,విద్యార్థులను విద్యా సంస్థ ఛైర్మన్ ఉత్తమన్నాయర్, సెక్రటరీ బాబు ఉన్నూన్నీ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

## మే చివరి నాటికి రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపులు పూర్తి

- **కాలనీల్లో రూ.400 కోట్లతో మౌలిక వసతులు**
- **కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు ఉద్దేశం లేదు**
- **రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ఏ స్థాయిలో ఉన్నా మే నెల చివరి నాటికి లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. చివరి దశలో ఉన్న ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుతం పూర్తి చేసిన ఖర్చును మినహాయించి మిగతాది ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అందిస్తామని చెప్పారు. గుత్తేదారులు పూర్తి చేయని చోట లబ్ధిదారులే పూర్తి చేసుకోవాలన్నారు. ఈ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. హైదరాబాద్లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాల ఇన్ఛార్జి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్బాబు, అడ్లూరి లక్ష్మణ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై మంత్రి పొంగులేటి మాట్లాడారు ''రెండు పడక గదుల ఇళ్లు అనర్హుల ఆక్రమణలో ఉంటే తొలగించి అర్హులకు కేటాయించాలి. ఇళ్ల కేటాయింపులో ఎమ్మెల్యేలను భాగస్వామ్యం చేయాలి. కాలనీల్లో రూ.400 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడితే అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేయడంతో పాటు సర్వీసు నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోం. అర్హులకు ఇళ్లను మంజూరు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 జాబితా.. దరఖాస్తు ఎప్పుడు చేశారు అనేది ప్రధానం కాదు. అర్హులకు ఇళ్లు అందించడమే ముఖ్యం. మొదటి విడతలో వివిధ కారణాలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించాలి. ప్రతి ఇందిరమ్మ ఇంటికి 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తున్నాం. అది దుర్వినియోగం కాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. నగరానికి దూరంగా రెండు పడక గదుల కాలనీలను నిర్మించడం వల్ల అక్కడ ఉండడానికి లబ్ధిదారులు ఇష్టపడటం లేదు. పలువురు ఈ ఇళ్లను అద్దెకు ఇచ్చి నగరంలోనే ఉంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి వారు నివసిస్తున్న సమీపంలోనే ఇళ్లను కేటాయించాలన్న అంశంపై కసరత్తు ప్రారంభించాం'' అని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 30 కేవీ ఉత్పాదన సామర్థ్యంతో నెలకొల్పిన సోలార్ రూఫ్ టాప్ విద్యుత్తు ప్లాంట్ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. దీని ద్వారా నెలకు సుమారు 4,500 యూనిట్ల మేర విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని, హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో వినియోగించే కరెంట్లో ఈ మేరకు ఆదా అవుతుందని మంత్రికి హౌసింగ్ కార్యదర్శి గౌతమ్ వివరించారు.

**ఆక్రమణలపై కఠిన చర్యలు**

''ప్రభుత్వ భూముల ఆక్రమణలను కట్టడి చేయడానికి కలెక్టర్లు కఠిన చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలి. ఇందుకోసం ఈ రెండు విభాగాలు సంయుక్త సర్వే నిర్వహించడం వల్ల భవిష్యత్తుల్లో వివాదాలుండవు. కొత్తగా రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదు. ఎక్కడ కలపడం, తీసివేయడం జరగదు'' అని అధికారులకు పొంగులేటి దిశా నిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని మంత్రి శ్రీధర్బాబు అన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన ప్రతి అంశాన్ని పరిష్కరించేలా కలెక్టర్లు కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, హౌసింగ్ కార్యదర్శి గౌతమ్ పాల్గొన్నారు.

## ముందస్తుగా స్వీయ జనగణన వివరాలను నమోదు చేసుకోండి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: స్వీయ జనగణన, ఇండ్ల వివరాల ప్రాథమిక సమాచారం నమోదు కార్యక్రమాలు, ప్రభుత్వ సూచనలు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గారి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక బృందాలు, అన్ని వర్గాల వారు, జిల్లా అధికారులు, వారి సిబ్బంది, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, కలెక్టరేట్లోని అన్ని విభాగాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి వివరాలను నమోదు చేసుకొని ఐడి పొందుతున్నారు,మే 11 నుండి ప్రారంభమయ్యే ఈ సర్వే జనగణన కార్యక్రమంలో సులభతరంగా తమ వివరాలను నమోదు చేయడం కోసం ముందస్తుగా స్వీయ జనగణన వివరాలను నమోదు చేసుకోవడం జరుగుతుందని,అదనపు కలెక్టర్ (అదనపు గణాంక అధికారి) రెవెన్యూ కె.అనిల్ కుమార్,ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు,డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు, వైద్య ఆరోగ్యశాఖ,మెడికల్ కాలేజ్ ప్రధాన విద్యాసంస్థలలో ఈ కార్యక్రమం విజయవంతం చేయడం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల స్వీయ జనగణన కార్యక్రమం కొనసాగింది. ప్రతి ఒక్కరూ తమ వివరాలను బాధ్యతాయుతంగా సమర్పించాలని అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్ని విభాగాల ప్రజలను అధికారులకు సూచించారు, ఈ నమోదు కార్యక్రమంలో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు, మట్టూరి నాగేశ్వరరావు, డివై గిరి, అయోధ్య రామయ్య, ఆకుల రమేష్, సత్యనారాయణ, శ్రీనివాసచారి, తదితరులు తమ వివరాలను నమోదు చేసుకొని ఐడి పొందారు

## శతమానం భవతి...

- **చర్ల సీహెచ్సీలో ఆరు నెలల్లో 100 శస్త్రచికిత్సలు**
- **స్థానిక గిరిజనులకు వరంగా మారిన ప్రభుత్వాసుపత్రి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండల పరిసర ప్రాంతాలకు వైద్య సేవల్లో కీలకమైన చర్ల ప్రభుత్వ ఆసుపత్రి గత ఆరు నెలల్లో 100 ట్యుబెక్టమీ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించి మరో మైలురాయిని సాధించింది. గతంలో చర్ల ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ట్యూబెక్టమీ వంటి శస్త్రచికిత్సల కోసం రోగులు 56కి.మీ దూరంలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రి వరకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రోగులపై ఆర్థిక భారం, శారీరక ఇబ్బందులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం సిజేరియన్ వంటి ప్రధాన శస్త్రచికిత్సలతో పాటు అత్యాధునిక టిఫా స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోకి రావడం గమనార్హం. భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సూచన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించి 6 నెలల క్రితం చర్ల ఆసుపత్రిలో నూతన ఆపరేషన్ థియేటర్ను ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు సమకూర్చారు. అలాగే మాతృ సేవలకు అవసరమైన ప్రసూతి, పిల్లల, మత్తు వైద్య నిపుణులను నియమించారు. దీంతో స్థానికంగా అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చి గిరిజన ప్రాంతాల ప్రజలకు పెద్ద ఊరట లభించింది. ప్రస్తుత జిల్లా కలెక్టర్ అంకిత్.. చర్ల ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇటీవలే ఒక రేడియాలజిస్ట్ వైద్య నిపుణురాలిని నియమించారు. అలాగే అత్యవసర సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా ముగ్గురు ఎంబీబీఎస్ వైద్యులు, ముగ్గురు శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

*** మరింత విస్తృత సేవల దిశగా కృషి: డీసీహెచ్ఎస్ డా. రవి బాబు**

జిల్లా కలెక్టర్ నేతృత్వంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మద్దతుతో చర్ల ప్రభుత్వాస్పత్రిలో మరింత విస్తృత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు తెలిపారు. 100 ట్యూబెక్టమీ శస్త్రచికిత్సల మైలురాయి సాధించినందుకు చర్ల ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ కె. శ్రావణి, డాక్టర్ కె. శివ రామకృష్ణ ప్రసాద్, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని అభినందించారు. అవసరమైన మద్దతు అందించిన జిల్లా కలెక్టర్ అంకిత్కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఓపీ గదుల ఏర్పాటు, పరికరాల మంజూరు చేసిన ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్కు ధన్యవాదాలు తెలిపారు. చర్లలో నిర్మాణంలో ఉన్న 30 పడకల నూతన భవనం పూర్తయిన తర్వాత మరింత మెరుగైన వైద్య సేవలు అందించగలమని పేర్కొన్నారు.

## పర్వతగిరి గ్రామంలో 33 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి పర్వతగిరి గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న ఆకాంక్ష నెరవేరిన రోజు రెండు కోట్ల రూపాయల వ్యయంతో పర్వతగిరి, సొమ్లతండ గ్రామాల మధ్య 33 కెవి సబ్ స్టేషన్ పనులకు భూమి పూజ చేసినా ఎమ్మెల్యే మురళి నాయక్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ ఉమ్మడి పర్వతగిరి గ్రామ ప్రజల కష్టాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పార్టీ విక్రమార్క వద్దకు తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సబ్ స్టేషన్ మంజూరు చేశారు.కొంత భూమి సమస్య వల్ల ఆలస్యమైనప్పటికీ దాన్ని పరిష్కరించి గురువారం సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన కార్యక్రమం చేసుకోవడం నాకు ఆనందంగా ఉంది.. ఇకనుండి మన ఉమ్మడి తర్వాత గిరి గ్రామాలకు కరెంట్ సరఫరా నిరంతరం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ అని ప్రజా పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెనువెంటనే మహబూబాబాద్ నియోజకవర్గ సుమారుగా 100 కోట్ల రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని సందర్భంగా తెలియజేశారు.రానున్న రోజుల్లో మహబూబాబాద్ నియోజకవర్గాన్ని బంగారు కోటగా మారుస్తానని శాసనసభ్యులు డా''భూక్యా మురళి నాయక్ అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు,మండల అధికారులు,జిల్లా నాయకులు, ఉమ్మడి పర్వతగిరి గ్రామ పంచాయతీ సర్పంచులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఉపముఖ్యమంత్రి



శ్రీవారిని గురువారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్లో శ్రీవారి మూలమూర్తి సేవలో కుటుంబసభ్యులతో కలిసి వారు పాల్గొన్నారు. తిరుమలలో సినీనటుడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్, కావ్యారెడ్డిల వివాహానికి హాజరైన ఆయన గురువారం నూతన దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు.

## పదవీ విరమణ పొందిన వారికి సత్కారం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు ఏఎస్ఐలు, ఒక హెడ్ కానిస్టేబుల్ను గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందిన కొమరారం ఏఎస్సై బి.తాతారావు, డిఎఆర్ ఏఎస్ఐ టి.వెంకట్రావు, అశ్వారావుపేట ఏఎస్సైగా టి.వెంకట సుబ్బారావు, ఇల్లందు ఏఎస్ఐ అబ్దుల్ ఘని, డీఏఆర్ ఏఆర్ ఎస్ఐ కొరసా నాగేశ్వరరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీరామ్లను డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కార్యాలయ ఏవో మంజ్యా నాయక్, ఎంటిఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్బాబు, ఇతర అధికారులు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు శాలువాలతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మల్లయ్య స్వామి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ నుండి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## సి ఎస్ ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించాలి

*** కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి ప్రజాస్ఫూర్తి : గురువారం మినీ మీటింగ్ హాల్ లో సీఎస్ఆర్ సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులకు అవసరమైన వనరులను విస్తృతంగా వినియోగించుకునే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు రావాలని సూచించారు.ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన ప్రాధాన్యతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరాలు అందించారు. విద్య, వైద్యం, ముఖ్య రంగాల్లో సీఎస్ఆర్ నిధులను వినియోగించే అవకాశాలను చర్చించారు. ప్రభుత్వ పథకాలతో పాటు సీఎస్ఆర్ నిధులను అనుసంధానం చేస్తే మరింత ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.ప్రతి శాఖ తమకు అవసరమైన వాటిని గుర్తించి, స్పష్టమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. స్థానిక పరిశ్రమలు, సంస్థలతో సమన్వయం చేసుకుని సీఎస్ఆర్ నిధులను సమీకరించి ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు.సీఎస్ఆర్ నిధుల వినియోగంలో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. సీఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా అధికారులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టం జరిగితే సహించబోం

*** భాజపా అధ్యక్షుడు రామచందర్రావు**



భువనగిరి గ్రామీణం: రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోతే ఉద్యమిస్తామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్రావు హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా హన్మాపురంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ఇరవై రోజులు గడిచినా కొనుగోలు కేంద్రంలో ఇంకా 6,000 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉండటం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కల్లాల్లో కనీస సౌకర్యాలు లేవని.. ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నామని.. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో అకాలవర్షాలకు పదేపదే ధాన్యం తడవడం, ఆరబెట్టడంతోనే సరిపోతోందని రైతులు మొర పెట్టుకున్నారు. ఆగ్రహించిన రామచందర్రావు... ప్రభుత్వ అధికారులు, మిల్లర్లు, దళారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకే అమ్మేలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలి



భువనగిరి ప్రజాస్ఫూర్తి : గురువారం గుండాల మండలం అనంతారం గ్రామంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్. అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు. టార్పాలిన్లు, గన్ని సంచులు, నీటి వసతి, తదితర మౌలిక వసతులు పై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది? కేంద్రంలో సరిపోను తూకం మిషన్లు , మాయిశ్చర్ మిషన్ లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని,తదుపరి మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడ లారీలు లేకపోతే ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ వేడుకలో డాక్టర్ దంపతులకు ఘన సన్మానం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆయుష్ శాఖలో 26 ఏళ్ల పాటు ప్రభుత్వ హోమియో వైద్యునిగా సేవలందించిన డాక్టర్ బద్దెపూడి వెంకటేశ్వర రావు గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా భద్రాచలంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఆయన దంపతులను ఘనంగా సన్మానించారు. గిరిజన ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించిన ఆయన సేవలను పలువురు కొనియాడారు.సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ వెంకటేశ్వరరావు, తన సేవా కాలంలో ప్రజల ఆదరణ, సహచరుల సహకారం తనకు బలంగా నిలిచాయని తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజలకు సేవ చేయడం తనకు గొప్ప అవకాశంగా భావిస్తున్నానన్నారు.ప్రకృతి హరిత దీక్షలో భాగంగా పదవీ విరమణ పొందిన డాక్టర్ దంపతులకు పచ్చని మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొని వారికి అభినందనలు తెలియజేశారు.

# కేంద్రం ఏ మంచి పనిచేసినా అడ్డుపడటమే పనిగా ప్రతిపక్షాలు



హైదరాబాద్: మహిళా బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు మోదీని ఓడించామని సంబరపడుతున్నాయని, కానీ వారు ఓడించింది దేశంలోని 70 కోట్ల మహిళలనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. మే 10న హైదరాబాద్‌లో జరిగే 'జనాగ్రహ' సభలో కాంగ్రెస్ కుట్రలను ప్రధానమంత్రి ఎండగట్టనున్నారని తెలిపారు. గురువారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక తొలిసారి రాష్ట్రానికి వస్తున్నారు. మే 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు పరేడ్ మైదానంలో భారీ సభను ఏర్పాటుచేస్తున్నాం. బేగంపేట విమానాశ్రయం బయట ప్రధాని వివిధ కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని సుమారు రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతోపాటు, కొన్ని ప్రాజెక్టులను తెలంగాణ ప్రజలకు అంకితం చేయనున్నారు. మహబూబ్‌నగర్ ప్రాంతంలో సుమారు రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులను, హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించిన ఒక పెద్ద టర్మినల్, కాజీపేట నుంచి విజయవాడ వరకు మూడో రైల్వేలైన్ లాంటి ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కేంద్రం ఏ మంచి పనిచేసినా ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి. గతంలో స్వచ్ఛభారత్, పెద్దనోట్ల రద్దు, బేటీ పడావో బేటీ బచావో లాంటి కార్యక్రమాలపై విమర్శలు చేశారు. ఇప్పుడు మహిళా బిల్లును అడ్డుకున్నారు. డీలిమిటేషన్ పూర్తయితే దక్షిణాదికి న్యాయం జరిగేది. సీట్ల పెంపు జరిగి ఉంటే మహిళలకు, దళితులకు, గిరిజనులకు మరిన్ని అవకాశాలు లభించేవి. సీట్లు పెరగకుండా దక్షిణాదికి అన్యాయం జరిగితే దోషిగా నిలబడాల్సింది రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డే. కాంగ్రెస్‌కు భారాస కూడా వంత పాడింది. డీలిమిటేషన్ జరిగితే కుటుంబ పెత్తనం పోతుందని కేసీఆర్ నీతిమాలిన రాజకీయాలు చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని ప్రాంతాల్లో జనాభా చాలా ఎక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉంది. ఉదాహరణకు మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో 38 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఆ లోక్‌సభ సభ్యుడు నియోజకవర్గ ప్రజలందరినీ కలవడం సాధ్యం కాదు. ఈ అసమానత తగ్గించి, సీట్లను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. బంగారం లాంటి తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్, భారాసలు అప్పుల కుప్పగా మార్చాయి. అప్పులోళ్లు వస్తారనే భయంతో రాష్ట్ర ఆర్థిక మంత్రి తన ఛాంబర్‌లో పోలీసుల పహారాలో పనిచేయాల్సిన దుస్థితి వచ్చింది' అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# ప్రభుత్వ సలహాదారుగా వి.హనుమంతరావు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ సలహాదారు(బీసీ సంక్షేమం, అభివృద్ధి) గా మాజీ ఎంపీ వీహెచ్ నియమితులయ్యారు. సీఎస్ కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రెండేళ్ల తన పదవీకాలంలో మొదటి ఏడాది జీతాన్ని హనుమాన్ వ్యాయామశాలలో చదువుతున్న పేద విద్యార్థుల ఫీజులకు ఉపయోగించుకునేందుకు వీలుగా ట్రస్ట్‌కు అందజేయనున్నట్లు ప్రకటించారు. రెండో ఏడాది జీతం మొత్తాన్ని ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం దామోదరం సంజీవయ్య పేరిట ఏపీలో నిర్మించతలపెట్టిన స్మృతి భవనానికి విరాళంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వీహెచ్ గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. సీఎంకు, అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదానికి కారణమెవరు..?

* **పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్**
* **పోలీసుల దర్యాప్తులో సీసీ కెమెరాలే కీలకం...**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం - విజయవాడ జాతీయ రహదారిపై రుద్రంపూర్ సమీపంలోని ప్రభుత్వ పారిశ్రామిక విద్యా సంస్థ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రుద్రంపూర్‌నకు చెందిన సింగరేణి కార్మికుడు రూపేష్ పాసి మృతి చెందాడు. అతివేగంగా దూసుకొనివచ్చి కారు ద్విచక్రవాహనంపై వెళ్తున్న రూపేష్‌ను ఢీకొట్టడంతో అతను ఎగిరి కొంత దూరంలో రోడ్డు పక్కన ఉన్న సిమెంటు వ్యర్థాలపై పడటంతో తలకు బలమైన గాయాలు కావడంతో మృతిచెందినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. అయితే రూపేష్ అక్కడికక్కడే మృతిచెందాడా.. లేక తీవ్ర గాయాలు కావడంతో రోడ్డు ప్రమాదానికి కారణమైన కారులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడా.. అనే విషయంపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య ఉండగా, గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. రూపేష్ మృతితో కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

**– పోలీసుల దర్యాప్తులో సీసీ కెమెరాలే కీలకం..**

రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతంలో తొలగించిన సిమెంటు రోడ్డు వ్యర్థాలు ఉండటంతోనే రూపేష్ వాటిపై పడి తీవ్ర గాయాలపాలై మృతిచెందినట్లు స్థానికులు చెప్తున్నారు. సిమెంటు వ్యర్థాల వద్ద ఉన్న జెండా దిమ్మెకు సి.సి. కెమేరాలు ఉండగా పోలీసుల దర్యాప్తులో అవి కీలకం కానున్నాయి. ఐటీఐ సమీపంలో వారం రోజుల కిందట సిమెంట్ రోడ్డుకు సంబంధించిన వ్యర్థాలను పడవేశారని, వాటిని తొలగించకపోవడంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని స్థానికులు అంటున్నారు. ఢీకొన్న సమయంలో రూపేష్ ధరించిన హెల్మెట్ కూడా దూరంగా పడినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగానే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు.

# అవసరాల మేరకు కరెంటు కొనండి

* **వేసవిలో ప్రజలకు ఇబ్బందులు రావొద్దు**
* **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



హైదరాబాద్: వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎండల తీవ్రతతో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గురువారం ఇంధన శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఏసీలు, కూలర్ల వాడకం పెరిగిందని, వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరిగిందని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ ప్రజల అవసరాలకు ఏ మాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అవసరమైన విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను భట్టి ఆదేశించారు. ''ఆసుపత్రులు, తాగునీటి సరఫరా, అత్యవసర సేవలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. విద్యుత్ సంస్థలు సమన్వయంతో ముందుకు పోవాలి. విద్యుత్ డిమాండ్ పరిస్థితిని అధికారులు నిశితంగా పరిశీలించాలి. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి'' అని భట్టి పేర్కొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల అనుమతులు సులభతరం!



హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు ప్రక్రియను మరింత సులభతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందుకు సంబంధించిన అనుమతులను వేగంగా మంజూరు చేయడంతోపాటు అనవసర నిబంధనలను తొలగించడంపై నీతి ఆయోగ్ అధ్యయనం చేస్తోంది. ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్) ని 2035 నాటికి ఇప్పుడున్న 30 నుంచి 50 శాతానికి పెంచాలని జాతీయ నూతన విద్యా విధానం సిఫార్సు చేసింది. తాజాగా పాఠశాల స్థాయిలో కూడా ప్రైవేట్ విద్యాసంస్థల ఏర్పాటును ప్రోత్సహించే దిశగా రంగం సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా ఇటీవల నీతి ఆయోగ్ అధికారులు అన్ని రాష్ట్రాల పాఠశాల విద్యాశాఖల అధికారులతో ఆన్‌లైన్‌లో సమావేశం నిర్వహించారు. ఒక ప్రైవేట్ పాఠశాలను కొత్తగా ఏర్పాటు చేయాలంటే ఎన్ని శాఖల నుంచి అనుమతులు లేదా నిరభ్యంతర ధ్రువపత్రాలు (ఎన్ఓసీలు) పొందాలి? స్థలం ఎంత అవసరం? నిబంధనలు ఏమిటి? తదితర వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం దేశంలో మొత్తం 14.72 లక్షల పాఠశాలలుండగా.. వాటిలో ప్రైవేట్ పాఠశాలలు 23 శాతమే ఉన్నాయి.

**ఆ ఎన్ఓసీలు ఎందుకు..?**

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలను ప్రారంభించాలంటే విద్యాశాఖతోపాటు పోలీస్, మున్సిపల్, అగ్నిమాపక, ఆర్అండ్‌బీ తదితర శాఖల నుంచీ ఎన్ఓసీలు తప్పనిసరి. ఇక విద్యాశాఖకు దరఖాస్తు చేసుకునేటప్పుడు ఆయా నిబంధనలతోపాటు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు పత్రాలు (రూ.25 వేల నుంచి రూ.50 వేలు) కూడా అవసరం. వాటిని పాఠశాల నడిపినంత కాలం డ్రా చేయరాదు. ఈ నిబంధనలన్నిటినీ రాష్ట్ర అధికారులు నీతి ఆయోగ్‌కు వివరించినట్లు సమాచారం. అనవసర నిబంధనలు, సర్టిఫికెట్లను తొలగించాలని, పాఠశాల ప్రారంభించిన తర్వాత విద్యాపరమైన అంశాలతోపాటు నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అన్నది చూడాలని నీతి ఆయోగ్ అధికారులు అభిప్రాయపడినట్లు తెలిసింది.

**తెలంగాణకు అభినందన...**

ప్రస్తుతం పాఠశాలకు అనుమతి కావాలంటే వెయ్యి చదరపు మీటర్ల క్రీడా స్థలం అవసరం. సొంతంగా లేకున్నా జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి లీజ్‌కు కూడా తీసుకునేలా రాష్ట్ర విద్యాశాఖ గతంలోనే నిబంధనలు మార్చింది. దానికితోడు పాఠశాల ఏర్పాటుకు ఇంత స్థలం తప్పనిసరన్న నిబంధన లేదు. ఈ రెండు అంశాలపై రాష్ట్రాన్ని నీతి ఆయోగ్ అధికారులు అభినందించడం విశేషం. అన్ని రాష్ట్రాల నిబంధనలను తెలుసుకున్న నీతి ఆయోగ్ త్వరలో కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది.



# 'మేడిగడ్డ బ్యారేజీ పరీక్ష పనుల్లో వేగం పెంచండి'

మహదేవపూర్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీలో చేపడుతున్న పరీక్షల పనుల్లో వేగం పెంచాలని నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్ సూచించారు. అన్నారం(సరస్వతి)లో శుక్రవారం నుంచి పనులను ప్రారంభించాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ఈఎన్‌సీ రమేశ్, కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి గురువారం పరిశీలించి మాట్లాడారు. అదనపు కూలీలను నియమించి ఎన్డీఎస్ఏ మార్గదర్శకాల మేరకు మేడిగడ్డ బ్యారేజీ పనులను వేగిరం చేయాలన్నారు. బ్యారేజీ వద్ద బోర్ హోల్స్ డ్రిల్లింగ్ చేసే క్రమంలో గట్టి శిలా పొర తగిలే వరకు పనులు కొనసాగించాలన్నారు. అన్నారం బ్యారేజీ వద్ద సాంకేతిక పరీక్షల నిర్వహణ కోసం పనులు ప్రారంభించాలని చెప్పారు. వివిధ దశల్లో సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లను తక్షణమే పూర్తిచేయాలని ఆదేశించారు. మేడిగడ్డ పరిశీలన అనంతరం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో పనుల పురోగతి, ఏర్పాట్లపై సమీక్షించారు. సీఈ శ్రీనివాస్ గుప్తా, ఈఈ తిరుపతిరావు, డీఈఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ పేరుతో నేతల్ని ఇరికించే ప్రయత్నం



ఫిల్మ్‌నగర్: ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ నాయకులను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని భారాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అధికారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైందన్నారు. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్ హరీశ్‌రావులను ఇరికించాలని రెండో సిట్ వేశారన్నారు. ఈ కేసులో 350 మందిని విచారించినా ఇప్పటి వరకు ఛార్జిషీట్ దాఖలు కాలేదని తెలిపారు. ఛార్జిషీట్‌లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ల పేర్లు చేర్చాలని అధికారులపై సీఎం ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారని.. దీనిపై సిట్ వేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కొంతమంది నాయకుల ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని మండిపడ్డారు. ఐపీఎస్ అధికారులు చట్టం ప్రకారం పనిచేయాలని సూచించారు.

# పిల్లలూ... బస్టాండు పాఠం విన్నాకే బస్సెక్కేది




రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మెదక్ జిల్లా కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖ 'బాల హక్కుల దర్పిని రక్షాబాట' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. చిన్నారుల కోసం మెదక్ కొత్త బస్టాండులో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించింది. శిశు సంక్షేమశాఖ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి ప్రయాణికులకు, చిన్నారులకు బాలల హక్కులు, వారికి చట్టపరంగా లభించే వెసులుబాటు గురించి చిత్రాల ద్వారా వివరిస్తున్నారు. బాలికలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి కూడా వివరిస్తున్నారు. బడులకు సెలవుల నేపథ్యంలో రాకపోకలు సాగించే చిన్నారులు ఈ చిత్ర ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

# గురు తేజ్ బహదూర్ త్యాగం నిరుపమానం

* **మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్**
* **ధ్యాన వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, మంత్రి జూపల్లి**



నందిగామ: గురు తేజ్ బహదూర్ త్యాగం నిరుపమానమైందని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో గురు తేజ్ బహదూర్ వర్ధంతి, రామచంద్ర మిషన్ వ్యవస్థాపకులు బాబూజీ మహరాజ్, తుక్డోజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని గురువారం సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తెలంగాణ, ఉత్తరాఖండ్ గవర్నర్లు శివప్రతాప్ శుక్లా, గుర్మీత్ సింగ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోవింద్ మాట్లాడుతూ.. మానవ హక్కులు, ధర్మం, మత స్వేచ్ఛ రక్షించడంలో గురు తేజ్ బోధనలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సహజమార్గ పద్ధతిలో ధ్యానం చేస్తే మానవుని జీవితం పరిపూర్ణమవుతుందన్నారు. శ్రీరామచంద్ర మిషన్ తెలంగాణలో ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేసినందుకు హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమలేష్ డి పటేల్‌కు అభినందనలు తెలియజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. కన్హా శాంతివనం పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణలోని రామప్ప దేవాలయం, గోల్కొండ కోట, బుద్ధవనం వంటి చారిత్రక కట్టడాలను సందర్శించాలని విదేశీ ప్రతినిధులను కోరారు. కార్యక్రమానికి సుమారు 30 వేల మంది అభ్యాసీలు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

# తమిళనాట డీఎంకే.. పశ్చిమ బెంగాల్‌లో భాజపా: టుడేస్ చాణక్య

తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే కూటమి మరోసారి అధికారంలోకి రానుందని మెజారిటీ సర్వేలు అభిప్రాయపడగా.. నేడు విడుదలైన టుడేస్ చాణక్య సంస్థ (Todays Chanakya) కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేసింది. 234 స్థానాలకు గానూ 125 స్థానాలు (11+/) రావొచ్చని అంచనా వేసింది. అయితే, తమిళనాట కొత్తగా బరిలోకి దిగిన విజయ్ పార్టీ టీవీకేకు.. అన్నాడీఎంకే కూటమి కంటే ఎక్కువ స్థానాలు వస్తాయంటూ పేర్కొంది. ఆ పార్టీకి 63 స్థానాలు (11+/) రావొచ్చని తెలిపింది. అన్నాడీఎంకే కూటమి 45 (11+/) స్థానాలతో మూడో స్థానంలో నిలవొచ్చంది. ఓట్ల శాతం పరంగా చూస్తే డీఎంకే కూటమికి 39 శాతం, టీవీకేకు 30 శాతం, అన్నాడీఎంకే కూటమికి 27 శాతం ఓట్లు రావొచ్చని (3 శాతం అటూఇటుగా) అంచనా వేసింది.

**పశ్చిమ బెంగాల్‌లో భాజపాకే అవకాశం!**

ఉత్కంఠగా సాగిన పశ్చిమ బెంగాల్ పోరులో భాజపాకు విజయావకాశాలు ఉన్నాయని టుడేస్ చాణక్య సర్వే సంస్థ అభిప్రాయపడింది. 294 స్థానాలకు గానూ 192 స్థానాలు (11+/ ) ఆ పార్టీకి రావొచ్చని అంచనా వేసింది.





తృణమూల్ కాంగ్రెస్ కూటమికి 100 సీట్లు (11+/) రావొచ్చని పేర్కొంది. ఇతరులకు 02 స్థానాలు రావొచ్చని పేర్కొంది. భాజపాకు 48 శాతం ఓటింగ్ (3 శాతం +/), తృణమూల్‌కు 38 శాతం (3 శాతం +/), ఇతరులకు 14 శాతం (3 శాతం +/) ఓటింగ్ రావొచ్చని టుడేస్ చాణక్య అభిప్రాయపడింది.

- ఇక కేరళలో అధికార ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ మధ్య గట్టి పోటీ ఉండబోతోందని టుడేస్ చాణక్య అంచనా వేసింది. అయితే, యూడీఎఫ్‌కే ఎడ్జ్ ఉందని అభిప్రాయపడింది. 140 స్థానాలకు గానూ 69 (9+/) రావొచ్చని పేర్కొంది.
- అస్సాంలో 50 శాతం ఓట్లు, 102 సీట్లతో భాజపా భారీ విజయం అందుకోబోతోందని పేర్కొంది.

## భవానీపూర్‌లో కాపలా ఉంటా: మమతా బెనర్జీ



పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తోసిపుచ్చారు. తమ పార్టీ కార్యకర్తలను నిరుత్సాహపరిచేందుకే కొందరు ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మెజార్టీ మార్కును దాటి 226 సీట్లలో టీఎంసీ విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులను ఉద్దేశించి వీడియో సందేశం విడుదల చేసిన దీదీ కౌంటింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. మే 4న నిర్వహించే ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగే అవకాశముందని మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తన సొంత నియోజకవర్గమైన భవానీపుర్‌లో కాపలా కాస్తానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ కార్యకర్తలు అన్ని లెక్కింపు కేంద్రాల్లో 24 గంటలు నిఘా పెట్టాలన్నారు. లెక్కింపు రోజు కూడా పూర్తిగా పర్యవేక్షించాలని పిలుపునిచ్చారు.

## ‘అస్సాం సీఎం రెచ్చగొట్టడం వల్లే.. పవన్ ఖేరా అరెస్టుకు సన్నాహాలు..!’

పరువు నష్టం కేసులో పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది . అస్సాం సీఎం సతీమణి రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయంటూ ఖేరా చేసిన ఆరోపణలపై ఆమె ఫిర్యాదు మేరకు గువాహటిలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా చేసిన అభ్యర్థనను గువాహటి హైకోర్టు తిరస్కరించింది. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఆయన తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ కేసు విచారణ కోసం ఖేరాను కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని సింఘ్వీ కోర్టులో వాదించారు. ‘‘నిర్బంధ



విచారణతో అవమానించాల్సిన అవసరం ఏముంది? ఇది పరువు నష్టానికి సంబంధించిన అంశం. ఈ కేసులో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తాను చట్టాలకు అతీతమన్న రీతిలో ప్రవర్తించారు. ఆయన రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యల వల్లే పవన్ ఖేరా అరెస్టుకు పోలీసులు సన్నాహాలు చేశారు’’ అని ఆరోపించారు. ‘‘ఆయనపై మోపిన కొన్ని సెక్షన్ల కింద బెయిల్ పొందే అవకాశం ఉంది. మరికొన్ని సెక్షన్ల కింద అసలు అరెస్టు చేయాల్సిన అవసరమే రాదు’’ అని వాదించారు. అస్సాం పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ముఖ్యమంత్రి సతీమణి పాస్‌పోర్టులకు సంబంధించిన నకిలీ, వక్రీకరించిన కాపీలను ఖేరా చూపించారన్నారు. ఆయన చూపించిన కాపీలన్నీ అవాస్తవమైనవని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పరారీలో ఉండి, వీడియోలు విడుదల చేస్తున్నారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు.. ఖేరా వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.



## భారీ వర్షం.. తడిసి ముద్దయిన 5వేల పుస్తకాలు!

భారీ వర్షాలకు బెంగళూరు నగరం అతలాకుతలమైంది. బుధవారం సాయంత్రం నుంచి కురుస్తోన్న భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో నగరంలోని చర్చి స్ట్రీట్‌లో ఉన్న ఓ పుస్తక దుకాణంలోకి భారీగా నీళ్లు చేరాయి. దీంతో దాదాపు ఐదు వేల పుస్తకాలు తడిసి ముద్దయినట్లు దుకాణ యజమాని వాపోయారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, వర్షం కారణంగా నగర వ్యాప్తంగా వందలాది వృక్షాలు నేలకొరిగాయి. ఆయా ప్రాంతాల్లో వందకు పైగా వాహనాలు ధ్వంసం అయినట్లు అధికారులు వెల్లడించారు.

## సుదీర్ఘ యుద్ధానికి సిద్ధం: రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సామర్థ్యం లేక ఆపరేషన్ సిందూర్ ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ‘ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ. ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకువెళ్లాయి. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి.. సరైన సమయంలోనే దాన్ని ముగించాం. ఇది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయం. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం’ అని అన్నారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని పేర్కొన్నారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని.. మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు.

*** పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజంకు కేంద్ర బిందువు..**

ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని.. దానికి బహుముఖ కోణాలున్నాయన్నారు. దాన్ని కూకటివేళ్లతో



సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతిస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

## ‘మీ చట్టాలను మార్చండి..’
## 15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో సుప్రీం కీలక వ్యాఖ్యలు

15 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసులో గురువారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో 30 వారాల గర్భవిచ్ఛిత్తికి బాలికకు ఇటీవల అత్యున్నత న్యాయస్థానం అనుమతిచ్చింది. అయితే దీనిపై ఎయిమ్స్ క్యూరేటివ్ పిటిషన్ వేసింది. ఈ దశలో గర్భాన్ని తొలిగిస్తే.. ఆ బాలిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేంద్రానికి సుప్రీం సూచనలు చేసింది. అత్యాచార బాధితుల కోసం చట్టాలను సవరించాలని సూచించింది. ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని ఒక మహిళ మరీ ముఖ్యంగా ఒక బాలికను బలవంతం చేయలేమని ఇటీవల ఈ కేసులో సుప్రీంకోర్టు (Supreme Court) పేర్కొంది. అలాగే ఆ గర్భాన్ని తొలగించేందుకు అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఎయిమ్స్ సుప్రీంలో పిటిషన్ వేసింది. ‘‘ఎంతో ఆవేదనతో ఈ క్యూరేటివ్ పిటిషన్‌ను తీసుకువస్తున్నాం. ఈ దశలో గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదు. ఆ మైనర్ తల్లి ఆరోగ్యంపై సుదీర్ఘకాలంలో



తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇక్కడొక అవకాశం ఉంది. డెలివరీకి ఇంకా నాలుగు వారాలే ఉంది కాబట్టి బిడ్డకు జన్మనిచ్చి, దత్తతకు ఇచ్చే అంశాన్ని పరిశీలించొచ్చు. ఇదంతా ఆ బాలిక క్షేమం కోసమే’’ అని ఎయిమ్స్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు వెల్లడించారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ.. ‘‘బాలికపై అత్యాచారం జరిగిన కేసు ఇది. ఆ ఘటన తాలూకు క్షోభ ఆమెను జీవితాంతం వెంటాడుతుంది. ఆమె ఎంత బాధపడి ఉంటుందో ఊహించుకోండి. ఆ బాలిక ఆరోగ్యంపై శాశ్వత ప్రభావం లేకపోతే గర్భవిచ్ఛిత్తిని నిర్వహించాలి. ఈ ఆరోగ్య సమస్యల విషయంలో బాధితురాలి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలి. వారు తగిన నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయాలి. అందుకే ఈ విషయంలో నిర్ణయాన్ని బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నాం’’ అని పేర్కొంది. అత్యాచార కేసుల్లో బాధితులు గర్భం దాల్చితే ఏ సమయంలోనైనా దాన్ని తొలగించుకునేలా మార్పులు తీసుకురావాలని ఈసందర్భంగా కేంద్రానికి సూచనలు చేసింది. 20 వారాలు దాటిన తర్వాత కూడా ఈ అవాంఛిత గర్భాన్ని తొలగించుకునేందుకు అత్యాచార బాధితులకు అనుమతించేలా చట్టాన్ని సవరించాలని సూచించింది.



## పడవ బోల్తా.. ఏడుగురు మృతి పలువురి గల్లంతు

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ జిల్లాలో పడవ ప్రమాదం చోటుచేసుకుంది. బర్గి డ్యామ్‌లో సుమారు 30 మందికిపైగా పర్యాటకులతో వెళ్తున్న పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. 15 మందిని సహాయక బృందాలు కాపాడాయి. పలువురు గల్లంతయ్యారు. పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్తున్న సమయంలో బలమైన గాలులు వీయడంతో పడవ మునిగిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికారులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టారు.

## మ్యాప్ వివాదం.. భారత్‌కు నేపాల్ ఎయిర్‌లైన్స్ క్షమాపణలు

భారత్‌కు నేపాల్ ఎయిర్‌లైన్స్ క్షమాపణలు చెప్పింది. జమ్మూకశ్మీర్ ను పాకిస్థాన్‌లో భాగంగా చూపుతూ ఉన్న తన నెట్‌వర్క్ మ్యాప్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేయడమే అందుకు కారణం. దీనిపై నెట్టింట తీవ్ర విమర్శలు రావడంతో నష్టనివారణ చర్యలకు దిగింది. బుధవారం ఎయిర్‌లైన్స్ తన సోషల్ మీడియాలో ఒక మ్యాప్‌ను పంచుకుంది. అందులో కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు పాక్ భూభాగంలో భాగంగా చూపించింది. ఈ పోస్టు తెగ వైరల్ అవగా.. భారత నెటిజన్ల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఇంతలోనే ‘బాయ్‌కాట్ నేపాల్ ఎయిర్‌లైన్స్’ అనే హ్యాష్‌ట్యాగ్ కూడా తెర పైకి వచ్చింది. భారత విదేశాంగశాఖ, విమానయాన మంత్రిత్వశాఖలు నేపాల్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ




నెటిజన్లు పోస్టులు పెట్టారు. భోజ్‌పుర్ నటుడు, గాయకుడైన ఖేసరిలాల్ యాదవ్ కూడా ఈ చర్య రెచ్చగొట్టేదిగా ఉందని ట్వీట్ పెట్టారు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసినట్లుగా ఉందన్నారు. తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో నేపాల్ ఎయిర్‌లైన్స్ తన పోస్టును డిలీట్ చేసింది. తన మ్యాప్‌లో అంతర్జాతీయ సరిహద్దులకు సంబంధించిన విషయాల్లో తప్పులు జరిగాయని అంగీకరిస్తూ.. భారత్ కు క్షమాపణలు చెప్పింది. జరిగిన తప్పిదంపై అంతర్గత సమీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. కాగా.. భారత విదేశాంగశాఖ ఇంకా దీనిపై స్పందించలేదు.

## కారు డ్రైవర్‌కు రూ.4.70 కోట్ల జీఎస్టీ చెల్లించాలని నోటీసు

చెన్నై (ప్యారిస్): రూ.4.70 కోట్ల జీఎస్టీ చెల్లించాలని నోటీసు రావడంతో ఓ కారు డ్రైవర్ అవాక్కయ్యాడు. తమిళనాడులోని వేలూర్‌కి చెందిన కమల్‌నాథన్ కారు డ్రైవర్. పదేళ్లుగా తిరువేర్కాడులో భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. ఇటీవల వేలూర్‌లోని అతని చిరునామాకి జీఎస్టీ కార్యాలయం నుంచి ఓ నోటీసు వచ్చింది. అందులో.. రూ.4.70 కోట్ల జీఎస్టీ చెల్లించాలని ఉంది. దీంతో వెంటనే కార్యాలయానికి వెళ్లి వివరాలు అడిగాడు. ఎవరో కమల్‌నాథన్ ఆధార్, పాన్‌కార్డు వివరాలను ఉపయోగించి అతని పేరిట జీఎస్టీ రిజిస్టర్ చేసి హోసూర్, తిరుప్పూర్‌లో సంస్థలు నడిపాడని, తర్వాత వాటిని మూసివేసినట్లు తేలింది. దీనిపై కమల్‌నాథన్ జీఎస్టీ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.



# మధుర పరిమళాల మనోహరం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**









హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!

**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**



వడదెబ్బ తగలకుండా..!

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్ కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలోరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





## ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

# సెన్సెక్స్, నిఫ్టీ పతనం..

**మార్కెట్లను ముంచిన ముడిచమురు!**

**అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల మధ్య భారీగా పతనమైన మార్కెట్లు**

**భగ్గుమన్న క్రూడాయిల్ ధరలతో అమ్మకాల ఒత్తిడి**

**సెన్సెక్స్ 582 పాయింట్లు, నిఫ్టీ 180 పాయింట్ల నష్టం**

**డాలర్‌తో పోలిస్తే 95.20 స్థాయికి పడిపోయిన రూపాయి**

**ఐటీ, ఫార్మా మినహా మిగతా రంగాల షేర్లలో అమ్మకాలు**



**ముంబై:** అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భగ్గుమనడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సూచీలు పతనమయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 582.86 పాయింట్లు నష్టపోయి 76,913.50 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 180.10 పాయింట్లు క్షీణించి 23,997.55 వద్ద ముగిసింది.

ఇరాన్ శాంతి ప్రతిపాదనను అమెరికా తిరస్కరించడం, కీలకమైన చమురు రవాణా మార్గం హర్మూజ్ జలసంధి వద్ద దిగ్బంధనాన్ని తీవ్రతరం చేయడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే ఆందోళనలను పెంచింది. ఫలితంగా ద్రవ్యోల్బణం భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఈ ప్రభావంతో ఐటీ, ఫార్మా వంటి డిఫెన్సివ్ రంగాలు మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టపోయాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్, నిఫ్టీ కన్‌స్ట్రక్షన్ డ్యూరబుల్స్ సూచీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిఫ్టీలో టాటా మోటార్స్, హిందాల్కో ఇండస్ట్రీస్ వంటివి టాప్ లూజర్లుగా నిలిచాయి. మరోవైపు, ముడిచమురు ధరలు 120 డాలర్ల సమీపానికి చేరడంతో రూపాయి విలువ కూడా పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.20 స్థాయికి బలహీనపడింది. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం నిఫ్టీకి 23,800 వద్ద కీలక మద్దతు లభించగా, 24,100-24,150 శ్రేణిలో తక్షణ నిరోధం ఎదురవుతోంది.

# ఈపీఎఫ్ చందాదారులకు డబుల్ గుడ్ న్యూస్..

**భారీగా పెరగనున్న పెన్షన్.. ఏటీఎం నుంచి డబ్బులు విత్ డ్రా!**

**ఈపీఎస్-95 కింద కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచే ప్రతిపాదన**

**ఏటీఎంల ద్వారా పీఎఫ్ డబ్బులు విత్ డ్రా చేసుకునే సౌకర్యంపై కసరత్తు**

**చందాదారులకు 8.25 శాతం వడ్డీ రేటు ఇచ్చేందుకు ఈపీఎఫ్ఓ సుముఖం**

**2025-26 ఆర్థిక సంవత్సరంలో 8.31 కోట్ల క్లెయిమ్స్ సెటిల్ చేసి రికార్డు**

**పాత పీఎఫ్ ఖాతాలను యాక్టివేట్ చేసేందుకు 'ఈ-ప్రాప్తి' పోర్టల్ ప్రారంభం**



**న్యూఢిల్లీ:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) చందాదారులకు త్వరలో కీలకమైన శుభవార్తలు అందనున్నాయి. ఉద్యోగుల కనీస పెన్షన్‌ను భారీగా పెంచడంతో పాటు ఏటీఎంల ద్వారా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించడంపై ప్రభుత్వం, ఈపీఎఫ్ఓ దృష్టి సారించాయి. ఈ మార్పులు అమలైతే కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

ప్రస్తుతం ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95) కింద ఇస్తున్న కనీస పెన్షన్ రూ.1,000గా ఉంది. దీనిని ఏకంగా రూ.7,500కు పెంచాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. కార్మిక సంఘాల నుంచి వస్తున్న ఒత్తిడి, పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇదే సమయంలో చందాదారుల ఖాతాలకు 8.25 శాతం వడ్డీ రేటును జమ చేసే ప్రతిపాదన ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది.

చందాదారులకు మరింత ఊరటనిచ్చేలా, ఏటీఎంల ద్వారా నేరుగా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యంపై ఈపీఎఫ్ఓ కసరత్తు చేస్తోంది. ఇది అమలైతే, అత్యవసర సమయాల్లో డబ్బు డ్రా చేసుకోవడం మరింత సులభం, వేగవంతం కానుంది.

మరోవైపు క్లెయిమ్స్ పరిష్కారంలో ఈపీఎఫ్ఓ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 8.31 కోట్ల క్లెయిమ్స్‌ను పరిష్కరించింది. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 6.01 కోట్లుగా ఉంది. ఇందులో 5.51 కోట్లు అడ్వాన్స్ లేదా పాక్షిక విత్ డ్రాయల్ క్లెయిమ్స్ కావడం గమనార్హం. ఆటోమేషన్, డిజిటల్ ప్రక్రియల ద్వారా క్లెయిమ్స్ పరిష్కార వేగాన్ని ఈపీఎఫ్ఓ గణనీయంగా మెరుగుపరిచింది. సుమారు 71.11 శాతం అడ్వాన్స్ క్లెయిమ్స్‌ను కేవలం మూడు రోజుల్లోనే పరిష్కరించింది.

# నేటి నుంచి అమల్లోకి కీలక మార్పులు..

**గ్యాస్ సిలిండర్ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ వరకు కొత్త రూల్స్!**

**మే 1 నుంచి అమల్లోకి రానున్న పలు ఆర్థిక, నియంత్రణ పరమైన మార్పులు**

**ఎల్పీజీ సిలిండర్ ధరలు, బుకింగ్, డెలివరీ నిబంధనల్లో కీలక మార్పులు**




**న్యూఢిల్లీ:** నేటి నుంచి కొత్త నెల ప్రారంభం కాబోతోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా సామాన్యుడి దైనందిన జీవితం, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యక్ష ప్రభావం చూపే పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు చార్జీల వరకు, ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణల వరకు అనేక రంగాల్లో కొత్త నిబంధనలు అమలు కానున్నాయి. ఈ మార్పుల గురించి ముందుగా తెలుసుకోవడం బెటర్.

ప్రతి నెలా మొదటి తేదీన చమురు మార్కెటింగ్ సంస్థలు గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తాయి. ఈ క్రమంలో మే 1న గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావం సాధారణ కుటుంబాల నుంచి హోటళ్లు, రెస్టారెంట్ల వరకు అందరిపైనా పడుతుంది.

ఇకపై గ్యాస్ బుకింగ్ విషయంలో కూడా కొత్త నిబంధనలు రానున్నాయి. ఒకసారి సిలిండర్ బుక్ చేశాక, మళ్లీ బుక్ చేయడానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల నిరీక్షణ కాలాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. దీంతోపాటు డెలివరీ ప్రక్రియలో భద్రతను పెంచేందుకు డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) విధానాన్ని తప్పనిసరి చేస్తున్నారు. ఇకపై సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుడు తమ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని డెలివరీ ఏజెంట్‌కు చెప్పాల్సి ఉంటుంది.

# సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ జోరు..

**25 బంతులు మిగిలుండగానే ఛేజింగ్ పూర్తి**

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై గుజరాత్ టైటాన్స్ 4 వికెట్ల తేడాతో విజయం**

**కెప్టెన్ గిల్, జోస్ బట్లర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో సులభమైన ఛేదన**

**కేవలం 15.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన గుజరాత్**

**మూడు కీలక వికెట్లతో మెరిసిన భువనేశ్వర్ కుమార్**

**ఫినిషర్‌గా రాహుల్ తెవాటియా కీలక ఇన్నింగ్స్**



**గుజరాత్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ మరో అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. గురువారం నాడు నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న గుజరాత్, తొలుత ఆర్సీబీని కట్టడి చేసి, ఆ తర్వాత



బ్యాటింగ్‌లోనూ దుమ్మురేపింది. ఆర్సీబీ నిర్దేశించిన 158 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మరో 25 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకోవడం గుజరాత్ ఆధిపత్యానికి నిదర్శనం.

లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను వేగంగా ప్రారంభించారు. అయితే, సుదర్శన్ (6) త్వరగానే వెనుదిరిగినా, కెప్టెన్ గిల్ మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 18 బంతుల్లో 4 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో 43 పరుగులు చేసి ఆర్సీబీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి జోస్ బట్లర్ (19 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) కూడా తోడవడంతో గుజరాత్ స్కోరు దూసుకెళ్లింది. వీరిద్దరి ధాటికి పవర్-ప్లే ముగిసేసరికి గుజరాత్ వికెట్ నష్టానికి 69 పరుగులు చేసింది.

ఈ దశలో ఆర్సీబీ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అద్భుతం చేశాడు. తన అనుభవన్నంతా ఉపయోగించి కీలకమైన గిల్, బట్లర్, సుదర్శన్‌ల వికెట్లను పడగొట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పే ప్రయత్నం చేశాడు. దీంతో గుజరాత్ 92 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత రొమారియో షెపర్డ్ కూడా షారుఖ్ ఖాన్ (8), వాషింగ్టన్ సుందర్ (12) వికెట్లను తీయడంతో ఆర్సీబీ శిబిరంలో ఆశలు చిగురించాయి.

అయితే, 'ఫినిషర్' రాహుల్ తెవాటియా (17 బంతుల్లో 27 నాటౌట్) మరోసారి తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. కీలక సమయంలో క్రీజులో నిలబడి, ఒత్తిడిని జయిస్తూ జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతనికి జాసన్ హోల్డర్ (12), రషీద్ ఖాన్ (7 నాటౌట్) నుంచి సహకారం లభించింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 3 వికెట్లతో రాణించగా, రొమారియో షెపర్డ్ 2 వికెట్లు పడగొట్టాడు. జోష్ హేజిల్‌వుడ్ 4 ఓవర్లలో ఏకంగా 56 పరుగులు సమర్పించుకోవడం ఆర్సీబీ కొంపముంచింది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.



# డ్రెస్సింగ్ రూమ్‌లో ధూమపానం..

**రియాన్ పరాగ్‌కు 25 శాతం ఫైన్..**

**ఆర్ఆర్ జట్టుపై త్వరలో చర్యలు**

**న్యూఢిల్లీ:** రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు ఫైన్ పడింది. మ్యాచ్ ఫీజులో అతనికి 25 శాతం కోత విధించారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సమయంలో.. రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరేట్ తాగాడు. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఎలక్ట్రానిక్ డివైస్‌తో పొగ పీల్చుతున్నట్లు కనిపించిన ఘటన పట్ల సోషల్ మీడియలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆ ఘటనపై ఐపీఎల్ స్పందించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం ఫైన్ విధిస్తున్నట్లు ఐపీఎల్ తన ప్రకటనలో చెప్పింది.

పరాగ్ స్మోకింగ్ చేసిన విషయంపై ఆన్ ఫీల్డ్ అంపైర్లు తన్మే శ్రీవాత్సవ్, నితిన్ మీనన్ మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మకు ఫిర్యాదు చేయలేదు. విజువల్స్ చూసిన తర్వాత వాళ్లు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరాగ్ క్రమశిక్షణా ఉల్లంఘనకు పాల్పడినట్లు శర్మ తెలిపారు. లెవల్1 అఫెన్స్ ప్రకారం మ్యాచ్ ఫీజులు 25 శాతం ఫైన్ విధించారు. ఓ డీమెరిట్ పాయింట్ కూడా పరాగ్ ఖాతాలో పడింది. తప్పుచేసినట్లు రియాన్ అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ విధించిన ఫైన్‌ను ఆమోదించినట్లు ఐపీఎల్ ఓ ప్రకటనలో చెప్పింది.

రాజస్థాన్ రాయల్స్ జట్టు, యాజమాన్యంపై తీవ్ర చర్యలు తీసుకోవాలన్న ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ ప్రతిష్టకు ఆర్ఆర్



జట్టు భంగం కలిగిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఆ జట్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీసీఐ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాజస్థాన్ రాయల్స్ జట్టుపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నామని, కానీ ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఇంకా క్లారిటీ లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సాకియా తెలిపారు.

2019లోనే భారత ప్రభుత్వం ఈ-సిగరెట్లను బ్యాన్ చేసింది. చట్టం ప్రకారం ఆ సిగరెట్లు తాగిన వారికి ఏడాది జైలు శిక్ష లేదా లక్ష జరిమానా విధిస్తారు. పరాగ్‌పై ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.21 కింద చర్యలు తీసుకున్నట్లు బీసీసీఐ చెప్పింది. 2.21 కింద అన్ని రకాల ప్రవర్తనలు వస్తాయని ఆయన చెప్పారు. రాజస్థాన్ టీమ్ మేనేజర్ రోమీ బిందర్ ఓ మ్యాచ్‌లో డగౌట్‌లో మొబైల్ వాడిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో అతనికి లక్ష జరిమానా వేశారు.

# ఐపీఎల్‌లో భారీగా పరుగులు...

**ఇది వ్యాపారమన్న ముత్తయ్య మురళీధరన్**

**ప్రస్తుత సీజన్‌లో సులభంగా నమోదవుతున్న 200 పరుగులు**

**స్పాన్సర్లు, వ్యూయర్‌షిప్ అవసరమన్న మురళీధరన్**

**బ్యాటింగ్‌కు సహకరించేలా పిచ్ ఉంటుందన్న మురళీధరన్**

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ ప్రస్తుత సీజన్‌లో ఆయా జట్లు 200 పరుగులు సులభంగా నమోదు చేస్తున్నాయి. ఈ స్కోర్లను తదుపరి బ్యాటింగ్ చేసిన జట్లు కూడా ఛేదిస్తున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 30సార్లకు పైగా రెండొందల స్కోర్లు నమోదయ్యాయి. ప్రత్యర్థి జట్లు 265, 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన సందర్భాలు ఉన్నాయి. దీనితో బౌలర్లపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వస్తున్నాయి. భారీ పరుగులు రావడంపై సన్ రైజర్స్ హైదరాబాద్ స్పిన్ బౌలింగ్ కోచ్ ముత్తయ్య మురళీధరన్ స్పందించాడు. ఐపీఎల్ క్రికెట్ వ్యాపారమని స్పష్టం చేశాడు. స్పాన్సర్లు, వ్యూయర్ షిప్



అవసరమని అభిప్రాయపడ్డాడు. అయితే పరుగులు రావడానికి పిచ్ ప్రధాన కారణమని అన్నాడు.

టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ వేగంగా పరుగులు రాబడుతున్నారని, ఈ పిచ్‌లు బౌలర్లకు అంతగా సహకరించడం లేదని అన్నాడు. వీటికి తోడు బౌండరీ సైజ్‌లు కూడా చిన్నగా ఉండటం వల్ల బౌలర్లకు కష్టంగా మారిందని తెలిపాడు. బౌలింగ్‌కు సహకరించేలా పిచ్‌ను రెడీ చేస్తే ప్రేక్షకులు బోర్ కొడుతుందని చెప్పే ప్రమాదం ఉందని అన్నారు. ఐపీఎల్ స్ట్రక్చర్ కూడా అలాగే ఉందని పేర్కొన్నాడు.

భారీ మొత్తంలో పరుగులు రావడానికి బౌలర్లను తప్పుపట్టాల్సిన అవసరం లేదని తెలిపాడు. 2020 నుంచి మ్యాచ్‌లు చూస్తున్నవారు ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఎక్కువగా ఆశిస్తారని పేర్కొన్నాడు. మ్యాచ్ సమయంలో ఫోర్లు, సిక్సులు ఉండాలని కోరుకుంటారని అన్నాడు.

# ఇదేం వింత వ్యూహం?

**ఐపీఎల్ చరిత్రలోనే శార్దూల్ లాంటి ఇంపాక్ట్ ప్లేయరే లేడు!**

**సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడిపోయిన ముంబై ఇండియన్స్**

**ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి బ్యాటింగ్, బౌలింగ్ చేయని శార్దూల్ ఠాకూర్**

**ముంబై జట్టు వ్యూహంపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ**

**రియాన్ రికెల్టన్ అద్భుత సెంచరీ చేసినా ఫలితం శూన్యం**

**హెడ్, అభిషేక్, క్లాసెన్ మెరుపులతో హైదరాబాద్ సునాయాస విజయం**

**ముంబై:** ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ఓటముల పరంపర కొనసాగుతోంది. సొంత మైదానం వాంఖడే స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిపోయి, ఈ సీజన్‌లో ఆరో ఓటమిని నమోదు చేసింది.



అయితే, ఈ ఓటమి కంటే ఎక్కువగా ముంబై జట్టు తీసుకున్న ఓ విచిత్ర నిర్ణయంపైనే ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చిన శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ లేదా బౌలింగ్ చేయకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు విల్ జాక్స్ (46), రియాన్ రికెల్టన్ తొలి వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం అందించారు. ముఖ్యంగా రికెల్టన్ ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 55 బంతుల్లో 123 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోరు చేసింది.

అయితే, భారీ లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏమాత్రం తగ్గలేదు. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 76), అభిషేక్ శర్మ (24 బంతుల్లో 45) కేవలం 8.4 ఓవర్లలోనే 129 పరుగుల భాగస్వామ్యంతో విజయానికి బలమైన పునాది వేశారు. ఆ తర్వాత హెన్రిచ్ క్లాసెన్ (22 బంతుల్లో 50), సలీల్ అరోరా (10 బంతుల్లో 30ని) మెరుపులు మెరిపించడంతో హైదరాబాద్ సునాయాసంగా విజయం సాధించింది.

**ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి బ్యాటింగ్, బౌలింగ్ చేయని శార్దూల్!**

మ్యాచ్ ముగిసిన తర్వాత "ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన శార్దూల్ ఠాకూర్‌తో బ్యాటింగ్ గానీ, బౌలింగ్ గానీ ఎందుకు చేయించలేదు?" అనే ప్రశ్న 'ఎక్స్' (ట్విట్టర్)లో వైరల్‌గా మారింది. ఐపీఎల్ చరిత్రలోనే బహుశా ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చి బ్యాటింగ్, బౌలింగ్ చేయని మొదటి ఆటగాడు శార్దూల్ కావచ్చని విశ్లేషకులు, అభిమానులు చర్చిస్తున్నారు. ముంబై యాజమాన్యం అనుసరించిన ఈ వింత వ్యూహంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు శార్దూల్‌ను జట్టులోకి తీసుకురావడం వెనుక వ్యూహం ఏంటో అంతుచిక్కక అభిమానులు తలలు పట్టుకుంటున్నారు.

MOVIE TIME

## ఓటీటీలోకి బైకర్ విడుదల



టాకీస్: టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను 'శర్వా' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.

## ప్రళయ్ మూవీ పనుల్లో రణ్‌వీర్ బిజీ



టాకీస్: 'ధురంధర్ 2' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు నటుడు రణ్‌వీర్ సింగ్. ఈ సినిమా హిట్ తర్వాత గతంలో అంగీకరించిన కొన్ని సినిమాల నుంచి ఆయన వైదొలుగుతున్నారంటూ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్రళయ్' టీమ్ స్పందించింది. ఆయన ఈ సినిమా నుంచి వైదొలగలేదని స్పష్టం చేసింది. రణ్‌వీర్ సింగ్ హీరోగా జై మెహతా తెరకెక్కిస్తున్న చిత్రమిది. వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు కూడా ఇటీవల ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో టీమ్ స్పందిస్తూ.. 'రణ్‌వీర్, జై ఇద్దరూ 'ప్రళయ్' సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. నిరంతరం చర్చలు జరుపుతూ స్క్రిప్ట్‌ను లాక్ చేశారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడని ఓ భారీ అద్భుతాన్ని తెరపై ఆవిష్కరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఆగస్టులో 'ప్రళయ్' షూటింగ్ ప్రారంభమవుతుంది' అని వెల్లడించింది.




## భోగిలో... కందుల సులోచనగా అనుపమ

టాకీస్: టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 28, 2026 న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

## అగధలో మంజుల మనవరాలు జోవిక

టాకీస్: ప్రముఖ సీనియర్ దర్శక నిర్మాత ఎమ్మెస్ రాజు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. హారర్ జానర్‌లో రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ద్వారా తమిళ నటి వనితా విజయ్ కుమార్ కుమార్తె,అలనాటి మంజుల మనవరాలు జోవిక విజయ్ కుమార్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. చిత్రంలో ఆమె 'హరిణి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆమెను ఒక తీవ్రమైన శక్తిగా అభివర్ణించారు మేకర్స్. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బాలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రావణ్ రెడ్డి 'సింహ'గా, కామాక్షి భాస్కర్ల 'మహాదేవి'గా నటిస్తుండగా, ఉల్కా గుప్తా, షిజు అబ్దుల్ రషీద్ వంటి తారలు



కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సుమారు 45 నిమిషాల పాటు సాగే భారీ వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతాన్ని అందిస్తుండగా, నాని చమిడిశెట్టి ఛాయాగ్రహణం, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ మరియు రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## కల్కి మూవీలో నటించడం లేదన్న జేడీ

టాకీస్: రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు నాగ్ అశ్విన్‌ల కాంబినేషన్‌లో వచ్చిన 'కల్కి 2898ఏడీ' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న ఈ చిత్ర సీక్వెల్‌కు సంబంధించి గత కొద్దిరోజులుగా ఒక ఆసక్తికర వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. టాలీవుడ్ సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి ఈ రెండో భాగంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతుంది.

అయితే తాజాగా తన సినిమా 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో పాల్గొన్న ఆయన ఈ రూమర్లపై స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'కల్కి 2'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ఇప్పటివరకు తాను ఎలాంటి షూటింగ్‌లోనూ పాల్గొనలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రచారాన్ని కేవలం సరదాగా ఎంజాయ్ చేశానని చెబుతూ, ఆ వార్తలకు జేడీ స్వస్తి పలికారు.

ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సీక్వెల్‌లో ప్రభాస్ భైరవ, కర్ణ పాత్రలతో పాటు మరో విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాల పాత్రల నిడివి ఈసారి మరింత ఎక్కువగా ఉంటుందని సమాచారం.




## దృశ్యం-3 టీజర్ విడుదల

టాకీస్: మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'దృశ్యం 3' టీజర్ ఎట్టకేలకు విడుదలైంది. బుధవారం సాయంత్రం విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ వీడియోలో గత రెండు భాగాలకు సంబంధించిన కీలక ఘట్టాలను గుర్తు చేస్తూనే, మూడో భాగంపై భారీ అంచనాలను పెంచేశారు దర్శకుడు జీతూ జోసెఫ్. గతంలో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి అత్యంత ధైర్యంగా, ప్రశాంతంగా ఎత్తుగడలు వేసిన జార్జ్ కుట్టీ, ఈసారి మాత్రం తీవ్రమైన భయంలో కనిపిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ఇప్పుడు నాకు భయంగా ఉంది సార్.. నన్ను ఇంకెవరో గమనిస్తున్నారని అనిపిస్తోంది' అంటూ మోహన్‌లాల్ చెప్పే డైలాగ్ ఈసారి కథలో ఏదో పెద్ద ప్రమాదం పొంచి ఉందని సూచిస్తోంది. ఈ టీజర్‌లో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ తో పాటు ఆశా శరత్ వంటి పాత పాత్రలన్నీ కనిపించి సందడి చేశాయి. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌లాల్ పుట్టినరోజైన మే 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని




చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ మూడవ భాగంతోనే సెన్సేషనల్ సిరీస్‌కు ముగింపు పలకనున్నట్లు తెలుస్తోంది. ఇక మలయాళ టీజర్ రావడంతో తెలుగులో విక్టరీ వెంకటేష్ నటించే రీమేక్ ఎప్పుడుంటుందా అని టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.